# సెలక్షన్

గుడిమెట్ల గోపాలకృష్ణ

"ఒక్కగానొక్క పోస్టు నీకిచ్చేనే అనుకో.

"అనుకోవడమేమిటిసార్. మీరు నాకివ్వక తప్పదు. పరిస్థితి భయంకరంగా వుంది."

"సరే ఇస్తానే అనుకో, నాకేం లాభం?"

"...... ."

"మాట్లాడవేం. ఇప్పుడీపోస్టుకి ఎంత డిమేండో నీకు తెలీదు. ఏదో కులం వాడివని నీకిద్దామని పిలిపించేను కానీ"

"మీ రెలాంటి ప్రతిఫలం కోరుతారో నా పరిధిలో వుంటే మీ కోర్కె తీర్చడానికి శాయశక్తులా ప్రయత్నిస్తాను"

"నాకో అమ్మాయి పెళ్ళికుంది. దాన్ని నువ్వు చేసుకోవాలి"

"అంతేనా. ఇంకా ఏమోఅనుకున్నాను"

"ఒప్పుకున్నట్టేగా"

"ఏంసార్ నేను బేరం చెడతాననుకున్నారా?"

"నే నడిగిన దానికిది జవాబు కాదు"

"అలాగే నా కుద్యోగం ముఖ్యం. ఎలాగూ ఓ అమ్మాయి మెళ్ళో తాళి కట్టాలి కదా"

"అయితే నువ్వు కొన్నింటికి మాటివ్వాలి"

"అడగండి"

"మా అమ్మాయిని పెళ్ళాడిన తర్వాత ఏదో వుద్యోగం కోసం చేసుకున్నాను అన్నట్టుగా కాకుండా భార్యగా చూడాలి"

"అలాగే"

"నేను కానీ కట్నం ఇవ్వను"

"నేను తీసుకోను"

"మీరిద్దరూ అన్యోన్యంగా వుండాలి"

"అలాగే"

"మా అమ్మాయిని నెలకోసారైనా మా ఇంటికి తెస్తుండాలి"

"అలాగే"

"మా అమ్మాయికి విహార యాత్రలంటే ఇష్టం. ప్రతి వీకెండ్‌కి ఎక్కడికైనా తీసుకెళుతుండాలి"

"అలాగే"

"మా అమ్మాయి హిందీ, ఇంగ్లీష్ మూవీస్ ఎక్కువ చూస్తూంటుంది"

"అలాగే"

"మా అమ్మాయి కాశ్మీర్ సిల్కు, గాజీ సిల్కు, పట్టుచీరలు తప్పా మరేం కట్టదు."

"అందంగా వుండడానికి మంచి బట్టలు కావాలికదా"

"మా అమ్మాయి నవల్సు ఎక్కువ చదువుతుంటుంది కొంటూ వుండాలి. ఇంట్లోనే చిన్న లైబ్రరీ ఏర్పాటు చేసుకోవాలి"

"అవును పుస్తక ప్రపంచానికి రాస్తాను"

"మా అమ్మాయికి ఫొటోగ్రఫీ హాబీ"

"నాక్కూడా ఆ టేస్టు వుంది"

"మా అమ్మాయికి ఫ్రెండ్సు ఎక్కువ. వాళ్ళు వస్తుంటారు ఏమీ అనకోకూడదు"

"అలాగే"

"ఇక నువ్వు వెళ్ళొచ్చు"

"ఏం సార్, ఎప్పుడొచ్చి జాయిన్ కావాలి?"

"నువ్వు సెలెక్ట్ కాలేదు"

"ఏంటిసార్ అన్నీ ఒప్పుకున్నానుగా"

"అందుకే నువ్వు సెలెక్ట్ కాలేదు"